# రాజదూతలూ దేవదూతలూ

మా ఆవిడ ఇచ్చిన సలహాను పాటించడం నా పదేళ్ళ వైవాహిక జీవితంలో అలవాటైపోయింది. తొలిసారి ఆవిడ కాదన్నా, నేను కొనని స్కూటరు కొనడానికి రెండే ముఖ్య కారణాలు. కొత్తగా నేను 1975 జనవరిలో బదిలీమీద వచ్చిన ఈ కలకత్తా మహానగరంలో బస్సులో ప్రయాణం చెయ్యడమంటే యమబాధ. మా ఆవిడే రద్దీలో ఒకనాడు ఇరుక్కుని ఊపిరికి గింజుకుంది. స్కూటర్ లైసెన్సు ఉన్నా నేనెప్పుడూ ఏదో ఆలోచిస్తుంటానట. నా మతిమరుపు యే ఏక్సిడెంట్‌ని తెస్తుందోనన్న ఆమె రిమార్కును ఇన్సల్టుగా తీసుకున్నాను.

స్కూటర్ వచ్చాక ఆహ్వానించినా మా ఆవిడ గుత్తకొన్న అందాన్నిగానీ కోమల మందహాసాన్నిగానీ వెనక సీటులో ఒలకబొయ్యడానికి ఒప్పుకోలేదు. ఈ కినుక ఇంకా నా మనసు నుంచి తుడిచిపెట్టక ముందే ఒక ఏక్సిడెంట్‌లో ఇరుక్కున్నాను. మా ఆవిడ ఒకనాడు అన్నది అక్షరాలా నిజమైంది. నాకున్న జాగ్రత్త అవతలవానికి లేకపోవడంవల్ల లారీ నా స్కూటర్‌ని గుద్ది పారిపోయింది.

నాకు తెలివి వచ్చేసరికి నా కంటికి ఇద్దరు కనిపించారు. తేరి చూశాను. కొద్దిగా వణుకుపుట్టి రెండోవేపు తల త్రిప్పితే మా ఆవిడ కనిపించింది. మళ్ళీ

ఇటు మెల్లగా కళ్ళు త్రిప్పేసరికి ఇద్దరూ లేరు. ఎదురుగావున్న యమకింకరులు వెళ్ళిపోయినంత రిలీఫ్ వచ్చింది. కొన్నాళ్ళకు ఆసుపత్రినుంచి ఇంటికి వెళ్ళాక మా ఆవిడ ఆ ఇద్దర్నీ పొగుడ్తూనే వుంది. రోడ్డుమీద పడిపోతే ఎవరికివారు వెళ్ళి పోతుంటే వీళ్ళిద్దరే ఆస్పత్రిలో నన్ను చేర్చారట. నా జేబులో పర్సులోవున్న ఎడ్రసు ప్రకారం ఇంటికి వెళ్ళి ఆమెతో చెప్పారట. వాళ్ళు ఇన్నిరోజులైనా మళ్ళీ రాకపోవటంతో వాళ్ళ పేర్లు, ఎడ్రసులూ తీసుకోనందుకు ఎంతో పొరపాటు చేసినట్లు మా ఆవిడ అలా నొచ్చుకుంటుండేది. ఆవిడ అలా నొచ్చుకుంటుంటే నాకు వాళ్ళమీద అసహ్యం పెరుగుతుండేది. ఒకనాడు వాళ్ళు నాపాలిట దేముళ్ళు అంది.

నాకు ఒళ్ళుమండి "వాళ్ళు దొంగలు'' అన్నాను.

"మీ ప్రాణం, నా మాంగల్యం రక్షించిన వాళ్ళని దొంగలంటారేమి''టని మా ఆవిడ విసవిసలాడింది.

''ఆనాడు నా పర్సులోవున్న పది రూపాయలూ కాజేసినవాళ్ళు ఎవరంటావ్? వాళ్ళే....''

''నిజంగా దొంగలైతే - వాళ్ళ వెంటే ఆసుపత్రికి పరుగెత్తాను కదా - నా మెడలో గొలుసైనా, చేతి గాజులైనా వూడబీకేవారుగా...."

''నీ అదృష్టం, నా అదృష్టం కలిసిరాబట్టి వాళ్ళు నిన్నేం చేయలేదు. ఇది పల్లెకాదు, మహానగరం. ఇంకెప్పుడూ అంత పొరపాటు చెయ్యకు. అదృష్టం ఎప్పుడు తిన్నగా నడవదు. వాళ్ళను ఇంటికి రానిచ్చావంటే నమ్మించి మరీ నీ అదృష్టాన్ని అడ్డదారిలో పట్టించి దురదృష్టంగా మార్చేయగలరు.''

మా వాదనలింకా పూర్తి కాలేదు. ఇద్దరూ దిగబడ్డారు. నేను మాట్లాడ లేదు. వారిలో లోన బనియనైనా లేకండా పల్చని తెల్ల లాల్చీ వేసుకున్నవాడిని చూస్తే నాకు ఏమైనా చెయ్యగల సాహసి అన్న భయం పట్టుకుంది నేను మాట్లాడక పోతే వాళ్ళే వాళ్ళ పేర్లు చెప్పుకుని నా ఆరోగ్యం విషయం వాకబు చేస్తున్నారు. మా ఆవిడ రసగుల్లాలు వాళ్ళ కిష్టమని అప్పటి కప్పుడే తెప్పించి మరీ పెట్టింది. నేను చూస్తున్నాను. వింటున్నాను. మాట్లాడలేదు.

''ఈ రతన్ చక్రవర్తి, నేనూ చిన్నప్పటినుంచీ స్నేహితులమే. అపురూపమైన మనిషి - అలాంటి వాడికి యెన్ని....''

వాడి గురించి నాకు వినాలని లేదు. మాటలు మార్చడానికి ''నీ పేరు - కాశీప్రసాద్‌చౌదరీ కదూ?'' అన్నాను.

''ఔను.''

''ఎక్కడ నీ ఉద్యోగం?''

''ఎక్కడా లేదు.''

''అయితే భుక్తిగడవటమెలా?''

''మా అమ్మా, నాన్నకూ నేనొక్కడినే....''

''మీ నాన్న ఏం చేస్తున్నారు?''

''ఆయనను బెల్గోరియాలో అంతా వైద్యరాజంటారు.''

''అయితే, ముసలాడి ఆర్జనతో బ్రతుకుతున్నావన్నమాట!''

''అందాక. తరవాత ఈ ఋణం తీర్చేస్తాలెండి.''

''ఉద్యోగం ఎందుకు చెయ్యవు?''

''నా చేతులు చూడండి. ఎంత దృఢంగా ఉన్నాయో!''

''మా కాశీప్రసాద్ ఉపన్యాసం ఇచ్చినపుడు ఆ నోరు రసగుల్లాలతోపాటు గన్‌పౌడర్ కక్కుతుంది.'' అందుకున్నాడు రతన్.

''కాశీ! ఇంతకీ ఏమాత్రం చదువుకున్నావు?''

''కలకత్తా యూనివర్సిటీ ఆర్ట్స్ గ్రాడ్యుయేట్‌ని.''

నిదానంగా చూసి''అయితే...'' అని ఆపేశాను.

"ఇంత చదివి పది రూపాయలెందుకు దొంగతనం చేశానని అడగదల్చారా?"

నేను మౌనంగానే వున్నాను.

"ఆ రోజు మీకు తెలివి వచ్చేవరకు యింటికి వెళ్ళదల్చుకోలేదు. మాకు తిండిలేదు. దగ్గర అంత డబ్బులేదు. ఇవేళ రావటానికి అసలు కారణం మీ పది రూపాయలు మీకు అప్పచెప్దామనే .... '' అంటూ పది రూపాయల కాగితం నా యెదుటవున్న టీపాయ్‌మీద పెట్టి లేచిపోయాడు.

ఇద్దరూ వెళ్ళిపోయారు. ఆ పది రూపాయల కాగితంవేపు అలా కళ్ళప్పచెప్పి చూస్తున్నాగానీ. ఇంకా మనసులో గందరగోళంగా వుంది. నా అహం కొద్ది క్షణాల్లో కరగ్గానే ఒక మహా నటుని నటన యింతసేపు తిలకించా ననుకున్నాను. గుండెకు హత్తుకున్న నటన మరపురాని నటన. ఆ గొంతు మళ్ళీ మళ్ళీ వినాలని పిస్తోంది. ఎన్నిసార్లయినా ఇతనిని ఈ జగన్నాటకంలో ముఖ్య పాత్రధారునిగా చూడాలనిపిస్తోంది!

ఒక ఆదివారం కాశీప్రసాద్ బదులు అతని తల్లిదండ్రులు మా ఇంటికి వచ్చారు. నమ్రతను నిలువెల్లా నిలుపుకున్న వైద్యరాజ్ "నా కొడుకు కాశీ ప్రసాద్ - మీది చాలా జాలిగుండె అని చెప్పాడు'' అని అన్నాడు.

''నాదా?'' అన్నాను.

"ఎదుటివాళ్ళ కష్టనిష్ఠూరాలను మౌనంగా వినగలిగే ఓపిక మీలో ఉందట. అంటే, మీకన్నా ఎదుటివాళ్ళని హెచ్చుగా గౌరవిస్తున్నారుకదా?''

వైద్యరాజ్ కూర్చుని ఒకసారి నావేపు నిదానించి చూశాడు నా భార్య దగ్గరలో అతని భార్య కూర్చుంది. అతని మాటలు వినటానికి నేను ఎదురు చూస్తుంటే ఆమె మాట్లాడింది. ఆ మాటలు రవీంద్రుని సంగీతం వింటున్నట్లుంది.

"వాడు నా ఒకే ఒక సంతానం. కాళీమాత వరంతో లేక లేక కలిగాడు. ఉద్యోగంలో వుంటే చెడు సహవాసంలో పడేవాడా? కాశీకి మీరంటే గౌరవం. మీ చేతితో బిక్ష పెడ్తే వాడ్ని వేగిరం ఒక యింటివాడిని చేసేస్తాను. బాధ్యత తెలుస్తుంది."

"చెడు సహవాసం అంటున్నారు. దొంగలలో చేరాడా?"

"లేదు."

"దోపిడీలు, గృహదహనాలు చేస్తున్నాడా?"

"లేదు."

"యెదుటివాళ్ళ రక్తం చూస్తున్నాడా?"

"రక్తం అంటే వాడికి వల్లమాలిన భయం. గెడ్డం గీసుకున్నప్పుడు తెగి రక్తం కారిందని, చూశారా గెడ్డం పెంచేశాడు."

"తాగుతాడా?"

"అబ్బే - అబ్బే....సిగరెట్ అయినా తాగడు."

"అయితే కాశీచేస్తున్న చెడుగేమిటి?"

వైద్యరాజ్ అందుకున్నాడు:

"వాగుతాడు. ఎడతెరిపి లేకుండా వాగుతాడు. ఊరంతా వినిపించేటట్లు బాకాలా వాగుతాడు."

"మీ గల్లీకి లీడరా?"

"ఈ గాలీ, నీరూ, ఈ పచ్చదనం - అందరికీ సరిసమానంగా పంచేవరకూ పోరాడుతూనే వుంటానంటాడు. చెట్టుకు కాయలుంటాయి నాయనా! అందరూ చెట్టెక్కలేరు. చెట్టెక్కినవాడు కొమ్మలు దులపడు. సంచీలోకి కాయలు కోసుకుని దిగిపోతాడు. కొమ్మను దులపగలిగినవాడే దేవదూతరా నాయనా, కబుర్లు చెప్పితే దేవదూతలై పోరురా అన్నాను."

"మంచి గొంతుక వుంది. మాటాడనివ్వండి. అతను చెప్పినవి అతని చెవిలోనే మొక్కలై ఏనాడో కాయలు కాయిస్తాయి" అన్నాను నవ్వుతూ.

"మాటలతో యెవరికి సవాలు చెయ్యాలో యెవరికి చెయ్యకూడదో తెలుసుకోకపోతే ఎలా? ఆ మధ్య పెద్ద పోలీసు ఆఫీసరుతో జగడమాడాడు."

"ఎందుకు?"

"మా వీధిలో ఎవరో అమాయకుడ్ని అనవసరంగా లాకప్‌లో పెట్టి లాటీలతో పొడిచారని! నాకు తెలిసి, నేను పిడ్ని తీసుకరాడానికి పోలీసు ఠాణాకు వెళ్తే ఆ ఆఫీసరుతో అంటున్న మాటలు విని వణికిపోయాను."

"ఏమన్నాడు?"

"మా దయాధర్మాలవలన నీకీ హోదా వచ్చింది. అంచేత నువ్వు మా క్రింద కుక్కలా విశ్వాసంతో సేవ చెయ్యాలిగానీ, పులి పంజా యెందుకు చూపిస్తున్నావ్?" అని సవాల్ చేశాడు. పోలీసు నిఘాలో పడ్తే ఆ కబంధహస్తం నించి తప్పించుకోలేం. అంచేత మీరు దయచేసి వాడిని ఏదో ఒక ఉద్యోగంలో పడేయండి. వాడి ఆర్జనమీద బతకాలని కాదు, వాడి ప్రాణాలు కాపాడుకోవాలని మీ కిలా అర్థిస్తున్నాను" అన్నాడు.

"ఆ పోలీసు ఆఫీసరు మీతో ఏమైనా అన్నాడా?"

"నీ కొడుకు మితిమీరి పోతున్నాడు. జాగ్రత్తపర్చుకో" అన్నాడు. కొడుకుతో అన్నాను, తుపాకి చేతనున్నవాడి గుండె అగ్నిగోళంగా యెప్పుడు మారుతుందో చెప్పలేం. అగ్గిపుల్లతో సిగరెట్ వెలిగించినట్లు ట్రిగ్గర్ నొక్కేస్తాడు!"

"కాశీకోసం వుద్యోగం ప్రయత్నిస్తాను" అన్నాను.

"ఆ మాత్రం భరోసా యిచ్చారు. అంతే చాలు" అని వెళ్ళిపోయాడు.

కాశీప్రసాద్‌కు ప్రభుత్వ ఉద్యోగంకోసం ప్రయత్నించడం వృధాశ్రమ అవుతుంది. కారణాలు చాలా వున్నాయి. ఫలితాలను లాభాలతో కొలచే కంపెనీల్లో చూస్తే గొడవతప్పదు. ఏ కంపెనీ పెద్దా అసలైన నాయకుడ్ని ఉద్యోగిగా పెట్టుకోలేడు. ఒక జాగిలం యింకో జాగిలాన్ని తన పరిసరాలకు రానివ్వదు. ఈ కొట్లాట రాకండా చెయ్యాలంటే కాశీ పెద్దరికం చేయించగలిగే యేదో చిన్న స్వంత పనిలో పెట్టాలని ప్రయత్నిస్తున్నాను.

ఒకరోజు కాశీ ప్రసాద్ ఒంటరిగానే వచ్చాడు. ఇదివరకు వచ్చిన తన మిత్రుడు రతీన్ చక్రవర్తి గురించి గుర్తుకు తెచ్చి, అతనికో వుద్యోగం మీరు చూడండి అని కోరాడు.

"ప్రభుత్వ ఉద్యోగం అనగానే యెన్ని అడ్డంకులున్నాయో మీకు తెలుసు కదా! కొందరు మిత్రులున్నారు కాబట్టి, కంపెనీ సంబంధమైన యేదో వుద్యోగం చూడగలను. అయితే, అదీ నేను మీ కేరక్టరు మెచ్చి యిచ్చిన సర్టిఫికెట్ బట్టి దొరుకుతుంది. నీ కేరక్టరు సర్టిఫై చేయగలనుగానీ.... నీ మిత్రునిది మాత్రం చెయ్యలేను."

"నాకంటె అన్ని విధాలా వుత్తముడని నేను సర్టిఫై చేస్తాను."

"ఉత్తముడా?"

"సంశయమా?"

''ఆసుపత్రిలో కళ్ళు తెరవగానే నాకేం కనిపించిందో తెలుసా - గజగజ వణికి పోయాను.''

''ఎందుకూ?''

''రతీన్ గ్లాస్కో లాల్చీ వేశాడా?''

''వాడెప్పుడూ పల్చని లాల్చీ, లోన బనియను లేకుండా వేస్తాడు.''

'వాడి బొడ్డు దగ్గర బాకువుంది తెలుసా?''

''అది యెప్పుడూ వుంటుంది."

"ఎందర్ని పొడిచాడో? ఎందరి రక్తం తాగాడో?"

కాశీప్రసాద్ అదేపనిగా పకపక నవ్వి, కాసేపయ్యాక "రతీన్ గురించి నాకు తెలుసు సార్! వాడూ, నేనూ చిన్నప్పటి నించి ఒకేచోట పెరిగాం. ఒకే బడిలో చదివాం. వాడి నాన్న స్టేటు గవర్నమెంటులో గుమస్తా. ఒకరి దగ్గర పొరపాటునైనా ఒక పైసా లంచం పుచ్చుకోలేదు. చచ్చిపోయినప్పుడు యెదిగిన యిద్దరు ఆడపిల్లలని రతీన్ మీద పడేసిపోయాడు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. ఇది స్వతంత్ర భారతదేశం. కానీ, అన్ని రంగాలలో అందరం యింకా బానిసలమే. అధికారానికి,అహానికి, యిష్టా యిష్టాలకి, డబ్బుకి, విలాసాలకి - ఒకటేమిటి అన్నిటికి మనం బానిసలం సార్! ఈ బానిస బ్రతుకులు దేనికోసం? ఈ కుళ్ళిన కండలూ, విరిగిన ఎముకలతో చేసిన దుర్గంధంతో నిండిన శరీరాన్ని దేవతా విగ్రహంలా పూజచేసుకోడానికి! రతీన్ బతకాలా - చావాలా అన్న సమస్య రాగానే బతకడానికే నిశ్చయించాడు. వాడి చెల్లెళ్ళను పడుపు వృత్తిలో దింపకుండా వుండడానికే ఈ బాకును బొడ్డుదగ్గర దోపాడు. ఆత్మరక్షణ కోసం - ఎదుటి వాళ్ళని చంపడానికి కాదు - భయపెట్టడానికి!"

"జేబు దొంగకు నేనెక్కడ వుద్యోగం చూడగలను? నీ గురించి అంటే చెప్పగలను" అన్నాను.

కాస్సేపు ఆలోచించి.

''మీరు నాయందు సద్భావంతో వున్నందుకు సంతోషం. నా అవసరం కన్నా నా మిత్రుని అవసరం పెద్దది. నా కన్నా వుద్యోగానికి అన్ని విధాలా అర్హుడు వాడు. వాడిని కాదని నేను వుద్యోగంలో చేరితే నేను మనిషిగా బ్రతకలేను. నన్ను నేను శంకించే పిరికివానిగా బతకాలని లేదు. ఇక మీకు నచ్చితే అతనికి ముందు చూడండి". లేకపోతే నా విషయం శ్రమపడకండి అంటూ వెళ్ళిపోయాడు.

తాలిరోజు పిరికి నాలో పోలేదేమో-ప్రయత్నిస్తాననైనా అనలేకపోయాను. దేనికైనా అలవాటుపడ్డవాళ్ళు దాన్ని అంత సులువుగా వదలగలరా? జీవితంలో ప్రభుత్వ వుద్యోగిగా. సంసారిగా సురక్షిత పథంకు అలవాటుపడ్డాను కాబట్టి

(వాహనానికి అలవాటుపడ్డ మనిషి నడవలేనట్టు) రతీన్ చక్రవర్తి ఉద్యోగం విషయంలో అవసరమైన చిక్కుల్లో యిరుక్కోవటం యిష్టంలేక పెద్ద యత్నం చెయ్యలేదు.

కొన్ని నెలలు గడిచినా యిద్దర్లో ఎవరూ రాలేదు. పోనీ, కాశీప్రసాద్ తలిదండ్రులైనా రాలేదు. ఏమైందో ఏమిటోనని అనుకుంటే నేను ఆఫీసులో లేనప్పుడు ఒక ఫోన్‌కాల్ వచ్చిందట. నా పెర్సనల్ అసిస్టెంట్ అందుకుంది. ఎవరు ఎక్కడ నించి మాట్లాడుతోంది చెప్పకుండా "అతనిని అనవసరంగా యిబ్బంది పెట్టడం మాకెవరికీ యిష్టం లేదని రావుగారు వచ్చాక చెప్పండి" అని ఫోను దించేశాడట.

ఆ తరవాత ఆరునెలలైనా వాళ్ళ గురించి మేం యేమీ వినలేదు. ఎప్పుడో ఒకోసారి కృతజ్ఞతతో ఆ పేర్లను మా ఆవిడ గుర్తుకు తెచ్చుకుంటుంటే, ఒకసారి ఆ మహానటుడి నటన కళ్ళముందు తిరిగేది. నా జీవితంలో యే విశేషాలు, వింతలూ జరగక పోవడంతో లోకంకూడా సాఫీగా పోతోందన్న నమ్మకంతో బండి సాగిపోతోంది. ఒకప్పుడు పత్రికల్లో యే అల్లకల్లోలం చదివినా గుండెకు హత్తుకునేది కాదు.

ఒకరోజు ఉదయం, నా అలవాటు ప్రకారం బ్రేక్‌ఫాస్టు కోసం, డైనింగ్ టేబిల్ ముందు కూర్చొని పేపరు చదువుకుంటున్నాను.

"ఎన్నో అలవాట్లు తప్పించగలిగాను గానీ ఈ అలవాటు తప్పించలేక పోయాను!" అంది మా ఆవిడ ఎదురుగానున్న ఆమ్లెట్ ప్లేటును ముందుకు తోస్తూ....

కాస్సేపు మౌనంగా వున్నాను. ఆమె బ్రెడ్ ప్లేట్లను తోస్తూ. ఫోర్కులో టక్ టక్ శబ్దం చేస్తోంది.

"విన్నావా ఈ న్యూస్?" అన్నాను.

''ఎప్పుడూ వున్నవే లెద్దురూ'' అంది ఉదాసీనంగా. ''ముందు తినండి.''

ఆమెకు వినిపించేటట్లు గొంతుపెట్టి గట్టిగా పేపర్లో ఒక మారుమూల నున్న న్యూస్ ఐటమ్ యిలా చదివాను:

"బెల్గోరియాకు చెందిన నోటోరియస్ నక్సలైట్లు కాశీప్రసాద్ చౌదరీ, రతీన్ చక్రవర్తి బర్ధ్వాన్ ప్రాంతపు అడవులో పోలీసులతో తారసపడ్డారు. కాశీ ప్రసాద్ ఈ భేటీలో అక్కడే పోయాడు. రతీన్ చక్రవర్తికి బాగా గాయాలు తగిలాయి. ఆసుపత్రికి తెస్తుండగా త్రోవలో పోయాడు."

''అంటే?'' చప్పున లేచింది మా ఆవిడ.

"మన యింటికి వచ్చినవాళ్ళే."

"మీ ప్రాణాలు రక్షించి వాళ్ళేనాండీ. నా మంగళసూత్రం కాపాడిన వాళ్ళేనాండీ?"

"అవును వాళ్ళే."

ఒక్కసారి ఆమె నావేపు పరుగెత్తుకొచ్చి పెద్ద గొంతుకతో "ఎందుకు మీరీ దేవదూతల్ని చెట్లకి కట్టి కాల్చి చంపారు? చెప్పండి- చెప్తారా లేదా?" అంది.

"నేనా?"

"అవును. వీళ్ళని చంపిన ప్రభుత్వంలో మీరు పని చేస్తున్నారు. మీరే చంపారు. మీరే....మీరే!"

అలా ఏడుస్తూనే క్రింద కూలబడిపోయింది.

సిగ్గు, అవమానంతో తల వంచుకున్నాను. *

(1978)